



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 267 | మే 25 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





# మోపాల్ పీఎస్.. "చీకటి సామ్రాజ్యమా" ?

## జర్నలిస్ట్‌పై థర్డ్ డిగ్రీ...

### ఆ 14 గంటల సీసీ ఫుటేజ్ ఎక్కడ?!

మోపాల్ పోలీస్ స్టేషన్‌లో చట్టం ఖూనీ? రిపోర్టర్ బసవరాజుపై 'థర్డ్ డిగ్రీ' అరాచకం !

సుప్రీంకోర్టు ఆదేశాలు తుంగలో? మోపాల్ లాకప్‌లో 14 గంటల టార్చర్ వెనుక ఉన్న ఆ అదృశ్య హస్తాలు ఎవరివి?"

" కలంపై ఖాకీల ప్రతాపం! రిపోర్టర్‌కే లాకప్ నరకమైతే.. ఇక సామాన్యుడి గతేంటి?"

" బసవరాజ్ పేల్చిన సంచలన నిజాలు! ఉదయం 7:30 నుండి రాక్షసపర్వం.. సీసీపుట్టేజ్ ప్రజా సంఘాలు డిమాండ్!"

" మీడియా ప్రతినిధికే 'థర్డ్ డిగ్రీ' నరకమా? మోపాల్ ఉదంతంపై వెల్లువెత్తుతున్న ప్రశ్నలు!"

"రిపోర్టర్ బసవరాజ్ లాకప్ టార్చర్ మిస్టరీ! మోపాల్ పోలీసులు దాస్తున్న ఆ విజువల్స్ ఏంటి?"

**నిజామాబాద్ ప్రతినిధి మే 24 మన దునియా**

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టే కలంపై ఖాకీలు కక్షగట్టారా? ప్రశ్నించే గొంతుకను లాకప్ గదిలో తొక్కిపెట్టాలని చూశారా? మోపాల్ పోలీస్ స్టేషన్ వేదికగా జరిగిన ఒక జర్నలిస్ట్‌పై అమానుష పర్వం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. విచారణ పేరుతో ఒక రిపోర్టర్‌పైనే 'థర్డ్ డిగ్రీ' ప్రయోగించారంటే.. అక్కడ అరాచకం ఏ స్థాయిలో రాజ్యమేలుతుందో అర్థమవుతోంది. అసలు మోపాల్ పోలీస్ స్టేషన్‌లో చెప్పిందే వేదమా? అక్కడ దేశ చట్టాలు, సుప్రీంకోర్టు ఆదేశాలు వర్తించవా? అంటూ ప్రజాసంఘాలు, జర్నలిస్ట్ లోకం నిప్పులు చెరుగుతోంది.

ఉదయం 7:30 రాత్రి.. ఆ 14 గంటల 'లాకప్' నరకం!

సమాచారం ప్రకారం.. శుక్రవారం ఉదయం సరిగ్గా 7 గంటల 30 నిమిషాలకు బసవరాజును మోపాల్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అక్కడితో కథ ముగిసిపోలేదు.. అసలు రాక్షసకాండ అక్కడే మొదలైంది. ఉదయం 7:30 నుండి రాత్రి వరకు గడిచిన ఆ 14 గంటల సుదీర్ఘ సమయంలో స్టేషన్ నాలుగు గోడల మధ్య ఏం జరిగిందనేది ఇప్పుడు ఒక మిస్టరీగా మారింది. విచారణ అనే ముసుగులో తనపై అమానుషంగా 'థర్డ్ డిగ్రీ' ప్రయోగించారని, మూలఖాత్ లో స్వయంగా బాధితుడు బసవరాజ్ వెల్లడించిన సంచలన నిజాలు వింటుంటే ఒళ్లు గగుర్పొడుస్తోంది. చట్టాన్ని గౌరవించే ఒక జర్నలిస్ట్‌ను ఇంతలా చిత్రహింసలకు గురిచేయడం వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరు?

రిపోర్టర్‌కే ఈ గతి పడితే.. ఇక సామాన్యుడి పరిస్థితి ఏంటి?

సమాజంలో నాలుగో స్తంభంగా నిలిచే ఒక మీడియా రిపోర్టర్‌ను స్టేషన్‌కు పిలిపించి, 14 గంటల పాటు నిర్బంధించి, థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే.. ఇక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కే సాధారణ పౌరుడి పరిస్థితి ఏంటి? సామాన్యుడికి రక్షణ ఎక్కడ ఉంది?"ఒక జర్నలిస్ట్‌పైనే ఇంతటి తెగింపుకు ఒడిగట్టారంటే, మోపాల్ పోలీస్ స్టేషన్ నిరంకుశత్వానికి అడ్డాగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్కడ చట్టాన్ని పాతరేసి

(మిగతా 2వ పేజీలో..)

## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు.. కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్

ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ

మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య

గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ

తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు

(మిగతా 2వ పేజీలో..)



## కర్ణాటకపై సీఎం విజయ్ చూపు.. బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?

త్వరలో బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు

బెంగళూరులో నివసిస్తున్న లక్షలాది మంది తమిళులు

కర్ణాటకలో జెండా పాతాలనుకుంటున్న విజయ్

(మిగతా 2వ పేజీలో..)



## డిఎంకె - ఎన్‌డిఎ కూటమి: బీజేపీకి ఓకే చెప్పిన డిఎంకె..?

22 మంది ఎంపీలతో తమిళ రాజకీయాల్లో ఊహించని మలుపు...!

వాజ్‌పేయి ప్రభుత్వ కాలంలో డిఎంకె ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పుడు మళ్లీ అదే కూటమిలో చేరతారా?

**మన దునియా,తమిళనాడు:మే 24**

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ, నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం'తో చేతులు కలపడం రాష్ట్ర రాజకీయాల్లో




కొత్త చర్చకు దారితీసింది. ఈ క్రమంలో, డిఎంకె తన రాజకీయ వ్యూహాలను మార్చుకుంటూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమితో చేతులు కలిపే అవకాశాలను పరిశీలిస్తోందన్న వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

(మిగతా 2వ పేజీలో..)

## హైదరాబాద్‌లో కార్ రేసర్ల వీరంగం.. అడ్డుకున్న కానిస్టేబుల్‌కు గాయం

హైదరాబాద్ మాదాపూర్‌లో అర్ధరాత్రి కార్ రేసింగ్‌ల హల్‌చల్

అడ్డుకున్న కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టిన యువకుడు

ప్రమాదంలో కానిస్టేబుల్ రమేష్ చేతికి ఫ్రాక్చర్

కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు

వారాంతపు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 294 మందిపై కేసులు

హైదరాబాద్‌లోని ఐటీ హబ్ మాదాపూర్‌లో యువకులు మరోసారి బరితెగించారు.

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# డిఎంకె – ఎన్‌డిఎ కూటమి: బీజేపీకి ఓకే చెప్పిన డిఎంకె..?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డిఏ వ్యూహం: పార్లమెంటులో తన బలాన్ని మరింత పెంచుకోవాలని భావిస్తున్న ఎన్‌డిఏ కూటమి, డిఎంకె మద్దతుపై దృష్టి సారించింది. డిఎంకెకు ఉన్న 22 మంది లోక్‌సభ ఎంపీలు మరియు 8 మంది రాజ్యసభ సభ్యుల మద్దతును కూడగట్టుకోవడం ద్వారా కేంద్రంలో మరింత స్థిరమైన అధికారాన్ని దక్కించుకోవాలని బీజేపీ యోచిస్తోంది.

ప్రస్తుత పరిస్థితులు:

కాంగ్రెస్‌తో దూరం: కాంగ్రెస్‌తో సంబంధాలు తెగిపోయాయని సంకేతాలు వెలువడుతున్నాయి. లోక్‌సభలో కాంగ్రెస్ నుండి డిఎంకె సభ్యులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని సభాపతికి డిఎంకె లేఖ రాయడం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. పెద్ద సవాలు – 'సనాతనం': డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ గతంలో 'సనాతన ధర్మం'పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు (డెంగ్యూ, మలేరియాతో పోల్చడం) దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. బీజేపీ దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. కాబట్టి, డిఎంకె నేరుగా ఎన్‌డిఏలో చేరడం కంటే, కీలక బిల్లులు లేదా ఓటింగ్‌ల సమయంలో బయటి నుండి మద్దతు ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

చరిత్ర పునరావృతమవుతుందా? వాజ్‌పేయి ప్రభుత్వ కాలంలో డిఎంకె ఎన్‌డిఏలో భాగస్వామిగా ఉన్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఇప్పుడు మళ్లీ అదే కూటమిలో చేరతారా? అనేది తమిళనాడులో పెద్ద రాజకీయ చర్చగా మారింది. డిఎంకె ఈ దిశగా అడుగులు వేస్తే, అది తమిళ రాజకీయాల్లో అతిపెద్ద మలుపు అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు.. కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో కార్ రేసర్ల వీరంగం.. అడ్డుకున్న కానిస్టేబుల్‌కు గాయం

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి కార్ రేసింగ్‌తో హల్‌చల్ సృష్టించారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టడంతో అతడి చేతికి ఫ్రాక్చర్ అయింది. మాదాపూర్‌లోని నిలోఫర్ కేఫ్ సమీపంలో కొందరు యువకులు కార్ రేసింగ్, స్టంట్లు చేస్తూ గందరగోళం సృష్టించారు. మోడిఫైడ్ సైలెన్సర్‌తో ఓ కారు బీభత్సం సృష్టిస్తుండగా, లాఠీలతో ఉన్న ముగ్గురు పోలీసులు దానిని ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆగకపోవడంతో వెంబడించారు. ఈ క్రమంలో రమేష్ అనే కానిస్టేబుల్ కారును ఆపే ప్రయత్నం చేయగా, డ్రైవర్ ఉద్దేశపూర్వకంగానే అతడిని ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ చేతికి గాయమైంది. కారు డ్రైవర్‌ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన వీడియోలో, ఈ రేసింగ్ చూసేందుకు చాలా మంది యువకులు రోడ్డుపై గుమిగూడినట్లు కనిపించింది. వారాంతాల్లో ఐటీ కారిడార్‌లో యువకులు ప్రమాదకరమైన కార్, బైక్ రేసింగ్‌లకు పాల్పడటం సాధారణమైపోయింది. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా వారు పట్టించుకోవడం లేదు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 294 మందిపై కేసులు**

ఇదిలా ఉండగా, వారాంతంలో సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో 294 మంది పట్టుబడ్డారు. వీరిలో 255 మంది ద్విచక్రవాహనదారులు, 34 మంది కార్ డ్రైవర్లు, ఐదుగురు ఆటో డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. తాగి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 ప్రకారం 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించనున్నట్లు పోలీసులు హెచ్చరించారు.

# మోపాల్ పీఎస్.. 'చీకటి సామ్రాజ్యమా'? జర్నలిస్ట్‌పై థర్డ్ డిగ్రీ.. ఆ 14 గంటల సీసీ ఫుటేజ్ ఎక్కడ?!

(మొదటి పేజీ తరువాయి)

ఖాకీల జులూం నడుస్తోంది."జర్నలిస్ట్ సంఘాలు మరియు ప్రజాసంఘాల ఆగ్రహం

**సీసీటీవీ ఫుటేజ్ దాస్తున్నదెవరు? భయమెందుకు?**

ప్రతి పోలీస్ స్టేషన్‌లో విచారణ పారదర్శకంగా సాగాలని, సీసీటీవీ కెమెరాల నిఘా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చింది. మరి మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఆ నిబంధనలను తుంగలో తొక్కారా? బసవరాజు విషయంలో పోలీసులు శుక్రవారం నాటి పూర్తి 14 గంటల సీసీటీవీ ఫుటేజ్‌ను మీడియా ముందుకు తెచ్చేందుకు ఎందుకు జంకుతున్నారు? ఆ ఫుటేజ్ కనుక బయటకు వస్తే ఏ ఏ ఉన్నతాధికారుల ముసుగులు తొలగిపోతాయో, ఎవరి తలలు ఊడతాయోననే భయంతోనే కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రజాసంఘాలు డిమాండ్ ఖాకీ సామ్రాజ్యంలో వణుకు!**

బసవరాజుపై జరిగిన ఈ అరాచకానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, మానవ హక్కుల వేదికలు, జర్నలిస్ట్ సంఘాలు మోపాల్ పోలీస్ స్టేషన్ వైపు అడుగులు వేస్తున్నాయి. స్టేషన్ లాగ్‌బుక్ రికార్డులతో పాటు, శుక్రవారం నాటి పూర్తి వీడియో విజువల్స్‌ను ఒక్క సెకండ్ కూడా డిలీట్ చేయకుండా తక్షణమే బహిర్గతం చేయాలని అల్టిమేటం జారీ చేశారు. ఈ 14 గంటల లాకప్ టార్చర్ వెనుక ఉన్న అదృశ్య హస్తాలు ఎవరివి? బాధితుడైన రిపోర్టర్ బసవరాజుకు న్యాయం జరుగుతుందా? లేక సీసీటీవీ ఫుటేజ్ మాయం చేసి కేసును పక్కదారి పట్టిస్తారా? అనేది ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది!

# కర్ణాటకపై సీఎం విజయ్ చూపు.. బెంగళూరు మున్సిపల్ ఎన్నికల్లో 'టీవీకే' పోటీకి సిద్ధం?

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన పార్టీ టీవీకే విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా, త్వరలో జరగబోయే బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ (దీదీపీ) ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అంతేకాకుండా, నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది. ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో టీవీకే సాధించిన చారిత్రాత్మక విజయాన్ని బెంగళూరులోని విజయ్ అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకుని తమ మద్దతును చాటుకున్నారు. ఈ సానుకూలతలను ఓట్లుగా మార్చుకుని, అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని టీవీకే అధిష్ఠానం భావిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. కర్ణాటక రాజకీయాల్లోకి టీవీకే ఎంట్రీ ఇస్తుందనే వార్తలు బెంగళూరు రాజకీయ వర్గాల్లో ఇప్పుడే ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ... దీనిపై విజయ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీని ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ ముందడుగు ఉండబోతోందని, త్వరలోనే బెంగళూరు ఎన్నికల పోటీపై టీవీకే స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# ఇరాన్ అణ్వాయుధాలను కోరుకోవడం లేదు: అధ్యక్షుడు పెజెష్కియాన్

- అణ్వాయుధాల కోసం తాము ప్రయత్నించడం లేదన్న ఇరాన్
- పశ్చిమాసియాలో అశాంతికి ఇజ్రాయెలే కారణమని ఆరోపణ
- ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి ఉందన్న అమెరికా
- హర్మూజ్ జలసంధిపై శుభవార్త రావచ్చని సంకేతాలు
- దేశ గౌరవంతో రాజీపడబోమని స్పష్టం చేసిన ఇరాన్ అధ్యక్షుడు



ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆదివారం కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తాము కోరుకోవడం లేదని, ఈ విషయంలో ప్రపంచానికి హామీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. "ఈ ప్రాంతంలో అశాంతిని కోరుకుంటున్నది తాము కాదు. జియోనిస్ట్ ప్రభుత్వం (ఇజ్రాయెల్) మాత్రమే యుద్ధాన్ని, అశాంతిని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది" అని పెజెష్కియాన్ ఆరోపించారు. 'గ్రేటర్ ఇజ్రాయెల్' ప్రణాళికను ఇజ్రాయెల్ అనుసరిస్తోందని విమర్శించారు. దేశ గౌరవంతో చర్చల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని ఆయన తేల్చిచెప్పారు. ఇరాన్‌లో ఏ నిర్ణయమైనా సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ఎన్ఎస్ సీ) పరిధిలోనే, సుప్రీం లీడర్ అనుమతితోనే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ, ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. రాబోయే గంటల్లో హర్మూజ్ జలసంధికి సంబంధించి 'శుభవార్త' వెలువడవచ్చని ఆయన సూచించారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని రూబియో మరోసారి పునరుద్ఘాటించారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి: ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

# తాటి, ఈత వనం దగ్ధం





**మడిపల్లి గౌడన్నలకు వెంటనే నష్టపరిహారం అందించాలి**

**గౌడ కుటుంబాలకు అండగా ఉంటాం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**మన దునియా,హుజూరాబాద్ నియోజకవర్గం**

జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఈతవనం, తాటివనం పూర్తిగా దగ్ధమై గౌడ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయిన ఘటనపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. ఈరోజు ఆయన సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.అగ్నిప్రమాదంతో జీవనాధారం కోల్పోయిన బాధిత కుటుంబాలతో ఎమ్మెల్యే మాట్లాడి వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన నష్టంపై విచారం వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తక్షణ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, బాధితుల పరిస్థితిని వివరించి అత్యవసర సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఎక్సైజ్ సీఐతో కూడా మాట్లాడి సంబంధిత శాఖల ద్వారా గౌడ కుటుంబాలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి గౌడ సోదరులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ పథకంలో కొత్త చట్టం!

**జూలై 1 నుంచి అమలు!**

**మన దునియా,హైదరాబాద్:మే 24**

కేంద్ర ప్రభుత్వం దేశ గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మార్చే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది దశాబ్దాలుగా అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో, కొత్త చట్టాన్ని తీసుకువచ్చిం ది, కొత్తగా తీసుకువ చ్చిన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీ వికమిషన్ గ్రామీణ, వీబీ-జీరామ్ జీచట్టం- 2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ చట్టం అమలు ఎలా, పనుల పర్య వేక్షణ బాధ్యత ఎవరిది, పథకానికి ఎవరు అర్హులు, పని దినాలెన్ని, వేతనాల చెల్లింపులు ఎలా, రాష్ట్ర ప్రభుత్వాల విధులేంటి.. అన్న అంశాలను అందులో పేర్కొంది.లబ్ధిదారులు ఉపాధి హామీ చట్టం నుంచి వీబీ-జీరామ్‌జీ చట్టానికి మారే ప్రక్రి యను వివరించింది. ఈ చట్టం దేశవ్యాప్తం గా జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ముసా యిదా నిబంధనలపై అభ్యంతరాలుంటే జూన్ 21లోగా తెలియజేయాలని రాష్ట్రాలను, నిపుణుల ను, సంస్థలను, ప్రజా సంఘాలను కోరింది. ముసాయిదాలో పేర్కొన్న దాని ప్రకా రం.. వీబీ- జీరామ్‌జీ చట్టం అమలుకు కేంద్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఇందులో కేంద్రగ్రామీ ణాభివృద్ధి శాఖ, నీతి ఆయోగ్ నుంచి ప్రతి నిధులు, కేంద్రమంత్రు లు, రాష్ట్రాల ప్రతినిధు లు సభ్యులుగా ఉంటా రు. ఇక, కేంద్రస్థాయి లోనే సెంట్రల్ గ్రామీణ్ రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ పనులను



పర్యవేక్షిస్తుంది. చట్టం అమలును చేస్తుంది,ఈ చట్టంలో ఒక కూలీకి ఏడాదిలో కల్పించాల్సిన పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచారు. కూలీలు కోరిన 15రోజుల్లోగా పని ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే, వారికి భృతిని చెల్లిం చాలి. పని కల్పించడం ఆలస్యమైన మొదటి 30రోజుల్లో.. రోజువారీ గా కనీసం పావు వంతు వేతనం చెల్లించాలి. తర్వాత కూడా పని కల్పించక పోతే సగం వేతనాన్ని చెల్లించాలని ముసా యిదా నిబంధనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేవైసీ చేసుకున్న వారందరినీ కొత్త చట్టం కింద గుర్తిస్తారు.

# తెలంగాణలో మారుతున్న వాతావరణం.. మూడు రోజుల పాటు వర్షాలు, ఈదురుగాలులు

**నైరుతి రుతుపవనాల ప్రభావం.. పలు జిల్లాల్లో వర్ష సూచనలు । గంటకు 40--50 కి.మీ వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక**

**మన దునియా,హైదరాబాద్:మే 24**

తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండలు కొనసాగుతుండగా.. మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతున్నాయి. ఈ ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు, ఉరుములు, ఈదురుగాలులు నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతం, నైరుతి--ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, తూర్పు-మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల వైపు మరింత ముందుకు సాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.దక్షిణ బీహార్ పరిసర ప్రాంతాల నుంచి జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్ర తీరం వరకు ఉత్తర--దక్షిణ ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి సుమారు 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో తెలంగాణలో వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

**మూడు రోజుల వాతావరణ సూచన**

ఆదివారం, సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు.వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఉష్ణోగ్రతలు తగ్గినా.. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**కొన్ని జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక**

వర్షాల సూచనలు ఉన్నప్పటికీ.. రాష్ట్రంలోని కొన్ని ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకూడదని, ఈదురుగాలుల సమయంలో అవసరం లేకపోతే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. తగినంత నీరు తాగుతూ శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలని తెలిపారు.




# రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు గోస,బిజెపి భరోసా!

**మన దునియా,హైదరాబాద్:మే 24**




తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా...మార్కెట్ యార్డ్ కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బం దులు పడుతున్న తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించేందుకు రేపటి నుంచి రైతు గోస, బీజేపీ భరోసా, పేరిట యాత్రకుఅన్ని ఏర్పా ట్లు పూర్తి చేశామని,ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ యాత్రలో భాగంగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బస్సులో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తా రని.. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. మొదటి రోజు అదిలాబాద్, తాండూర్, లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అదే రోజు రాత్రి గజ్వేల్ చేరుకుని అక్కడ బస చేసి... రెండవ రోజు గజ్వేల్, నుంచి భువనగిరి, వరంగల్, భూపాల పల్లి, చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేసి మూడవ రోజు భూపాలపల్లి నుంచి కాటారం, మంథని, మీదుగా పెద్దపల్లి జిల్లా జిల్లా కేంద్రానికి చేరుకొని పోరుబాట నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు ప్రకటించాయి. శుక్రవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర నాయకు లు రాంచందర్‌రావు అధ్యక్షతన అందుబా టులో ఉన్న ఎంపీలు, ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీ లతో సమావేశం నిర్వహించారు.పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ కూడా దీనికి హాజరయ్యారు. రాష్ట్ర రైతాంగం ఎదు ర్కొంటున్న ఇబ్బందు లపై సమావేశంలో చర్చించారు.రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నడవడం లేదు. లారీలు లేవు, గన్నీ బ్యాగులు లేవు, రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇప్పటివరకు జొన్నల కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించ లేదు.. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యమే దీనికి కారణం' అని మండిపడ్డారు.

# ఈ ఏడాదిలో రోహిణి కార్తె ఎప్పటి నుంచి..

**మన దునియా,హైదరాబాద్:మే 24**

భారతీయ జ్యోతిష్యశాస్త్రంలో సూర్యుడికి అత్యంత ప్రాధాన్యం ఉంది. నవగ్రహాలలో రాజుగా పరిగణించే సూర్య భగవానుడు ప్రతి నెలా ఒక రాశి నుంచి మరో రాశిలోకి సంచరిస్తూ ఉంటాడు.బిఅలాగే నక్షత్రాల మార్పు కూడా భూమిపై వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుందని జ్యోతిష్య పండితులు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో సూర్యుడు లోకి ప్రవేశించనున్నాడు. ఈ రోహిణి కార్తెలోకి సూర్యుడు ఎప్పుడు ప్రవేశిస్తాడంటే?రోహిణి నక్షత్రంలో సూర్యుడు మే 25న ప్రవేశిస్తాడు. జూన్ 8 వరకు సంచరించే ఈ కాలాన్ని సంప్రదాయంగా 'రోహిణి కార్తె 'గా పిలుస్తారు. ఈ సమయంలో ఎండలు అత్యంత తీవ్రంగా ఉంటాయని ప్రజల నమ్మకం. సాధారణ వేసవి వేడి ఒక ఎత్తయితే, రోహిణి కార్తె సమయంలో మాత్రం భూమి నిప్పుల కుండలా మారుతుందని పెద్దలు చెబుతుంటారు. మధ్యాహ్న సమయంలో బయట అడుగు పెట్టలేనంతగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా 'రోహిణి ఎండలు' గురించి ఎన్నో సామెతలు, అనుభవాలు తరతరాలుగా వినిపిస్తూనే ఉన్నాయి. 'రోహిణి కార్తెలో రోళ్లు కూడా పగులుతాయి' అనే మాట ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ 'రోళ్లు' అంటే రాళ్లు లేదా గట్టి వస్తువులు కూడా వేడి తట్టుకోలేక పగిలిపోతాయన్న అర్థంలో ఈ సామెత వాడతారు. అంటే ఈ సమయంలో ఎండ తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటుందో చెప్పేందుకు పెద్దలు ఇలా పోల్చి చెబుతుంటారు.జ్యోతిష్య నమ్మకాల ప్రకారం రోహిణి నక్షత్రానికి అగ్ని తత్వం ఎక్కువగా ఉంటుందని భావిస్తారు. అందుకే ఈ సమయంలో సూర్య కిరణాలు మరింత ఉష్ణాన్ని విడుదల చేస్తాయని అంటారు. ఉదయం నుంచే మండే ఎండలు, మధ్యాహ్నం వేడి గాలులు, రాత్రివేళ కూడా తగ్గని ఉక్కపోత ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. ముఖ్యంగా రైతులు, కూలీలు, బయట పనులు చేసే వారు ఈ కాలంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.వాతావరణ నిపుణుల అభిప్రాయం ప్రకారం కూడా మే చివరి వారాలు, జూన్ ప్రారంభ రోజుల్లో భూమిపై ఉష్ణోగ్రతలు సహజంగానే అత్యధిక స్థాయికి చేరుతాయి. ఈ కాలంలో పొడి గాలులు, తేమ తగ్గడం, భూమి వేడి ఎక్కువగా నిల్వ ఉండటం వల్ల వేడి తీవ్రత పెరుగుతుంది. అందుకే సంప్రదాయ జ్యోతిష్య భావనలు, ప్రజల అనుభవాలు రెండూ కలిసి రోహిణి కార్తెను అత్యంత వేడి కాలంగా పేర్కొంటాయి.ఈ సమయంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు తాగడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం, మధ్యాహ్న వేళ బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఎండ ప్రభావానికి త్వరగా గురయ్యే అవకాశం ఉండటంతో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## వడదెబ్బతో చెన్నూర్ వాసి జోగు మహేష్ మృతి.

**హైదరాబాద్‌లో కూలి పని చేస్తూ ఆకస్మిక మరణం...**

**ప్రభుత్వం ?ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థుల వేడుకోలు...**

**మన దునియా,జనగాం జిల్లా: పాలకుర్తి:మే 24**



జనగాం జిల్లా: పాలకుర్తి మండలంలో విషాదం చోటుచేసుకుంది. చెన్నూర్ గ్రామానికి చెందిన, జోగు మహేష్ (40, తండ్రి మల్లయ్య) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందాడు.స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మహేష్ బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని చిలకలగూడలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పని చేస్తుండగా, ఒక్కసారిగా వడదెబ్బకు గురై కుప్పకూలిపోయాడు. తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబాన్ని పోషించే యజమాని అకాల మరణం చెందడంతో భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబం అత్యంత పేదరికంలో ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## వాజేడు సదస్సుకు భారీగా తరలివచ్చిన ఆదివాసిలు

## భద్రాచలంలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్







**మన దునియా, వాజేడు ,మే 24**

భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా వాజేడు మండలకేంద్రంలో ఆదివారం రైతు వేదికగ న్యాయ కళాశాలసాధన సదస్సును నిర్వహించారు గోండ్వానా సంక్షేమ పరిచేత్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు పెద్ద ఎత్తున ఆదివాసీలు తరళివచ్చారు ఈ కార్యక్రమానికి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శి పూణ్యం సాయి ముర్రం వీరభద్రం రాష్ట్ర అధ్యక్షులు వాసం నాగరాజు పుసూరు దబకట్ల సుమన్ చింత సర్వేస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా నాయకులు ఏ ఎన్ ఎస్ ఎస్ రాష్ట్ర నాయకులు కోర్స నరసింహమూర్తి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణ ఆదివాసి యువత విద్యాభివృద్ధి కోసం భద్రాచలంలో న్యాయ కళాశాల అత్యవసరమైన పేర్కొన్నారు గతంలో పోరాటాల ఫలితంగా వచ్చిన జీవో నెంబర్ 3 ద్వారా ఆదివాసులకు ఉద్యోగాల్లో ప్రయోజనం కలిగిందని ప్రస్తుతం ఏజెన్సీ చట్టాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం ఆందోళన కరమని విమర్శించారు న్యాయ కళాశాల ఏర్పాట్లు తో ఏజెన్సీ ప్రాంత యువతకు న్యాయ విద్యలు అవకాశాలు పెరిగి తమ హక్కులు చట్టాల పరిరక్షణకు బలంగా నిలబడ గలరని అభిప్రాయపడ్డారు ఈ డిమాండ్ సాధన కోసం జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు అనంతరం గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా వాజేడు మండలం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు వివిధ గ్రామాల నుంచి వచ్చి అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# నూతన గృహాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపిన భూక్యా జాన్సన్ నాయక్





**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే:24.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు చింతలపల్లె ఇప్ప రాకేష్ ఇటీవల నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ వారి నూతన గృహాన్ని సందర్శించి రాకేష్ కి మరియు వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో యువత చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దాసరి చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించిన భూక్యా జాన్సన్ నాయక్





**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే:24.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దాసరి చంద్రమౌళి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ చంద్రమౌళి మరణం గ్రామానికి, కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. పార్టీ తరపున కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే చంద్రమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొని చంద్రమౌళి కి నివాళులర్పించారు.

# కోదాడ హైవేపై ప్రమాదం..

**లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు!**

**మన దునియా,సూర్యాపేట జిల్లా కోదాడ:మే 24**

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని జాతీయ రహదారి--65 పై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని జాతీయ రహదారి--65 పై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాకినాడ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న యోలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ప్రభావంతో బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమై, ప్రయాణికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు నొప్పులతో విలవిల్లాడుతుండగా, మిగిలిన ప్రయాణికులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఘటన స్థలంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

నిద్ర మత్తులో...

తెల్లవారుజామున వేళల్లో డ్రైవర్ అలసటకు గురై నియంత్రణ కోల్పోవడంతో బస్సు లారీని ఢీకొట్టిందని వారు తెలిపారు. సమాచారం అందుకున్న కోదాడ టౌన్ సీఐ శివ శంకర్ నాయక్ తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని 108 అంబులెన్స్ ద్వారా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా, పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలను రహదారి పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మే । సోమవారం । 25 । 2026



# ప్రైవేటు ఆసుపత్రి నిర్లక్ష్యానికి బాలుడి బలి..!

**వాంతులని చేరితే నాన్ క్వాలిఫైడ్ వైద్యం**
**బాలాజి ఆసుపత్రిలో అడ్డగోలు వైద్యం**
**పరిస్థితి విషమించడంతో చేతులెత్తేశారు**
**హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో 12 ఏళ్ల మనీశ్వర్ మృతి**

**మన దునియా,షాద్ నగర్:మే 24**

వాంతులు అవుతున్నాయని ఆసుపత్రికి వస్తే, అవగాహన లేని నాన్ క్వాలిఫైడ్ వ్యక్తులు చేసిన వైద్యం ఒక బాలుడి ప్రాణాన్ని బలితీసుకుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో నకిలీ, అర్హత లేని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, అధికారుల పర్యవేక్షణ కరువవ్వడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు.

**ఏం జరిగిందంటే..?**

పెద్దపల్లి జిల్లా రామగుండం కు చెందిన రామచందర్ గత కొంత కాలంగా షాద్ నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. రామచందర్ కుమారుడైన 12 ఏళ్ల బాలుడు మనీశ్వర్ కు శనివారం మధ్యాహ్నం వాంతులవుతుండటంతో తల్లిదండ్రులలు షాద్ నగర్ పట్టణంలోని 'బాలాజి ఆసుపత్రి'కి తీసుకు వెళ్లారు. బాలుడిని అడ్మిట్ చేసుకున్న ఆసుపత్రి యాజమాన్యం, అక్కడ అందుబాటులో ఉన్న వ్యక్తులతో వైద్యం చేయించింది. శనివారం రాత్రంతా వారు ఇచ్చిన వైద్యం పనిచేయక పోవడం కారణంగా ఆదివారం తెల్లవారుజామున బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా మారింది. పరిస్థితి చేతులు దాటిపోవడంతో బాలాజి ఆసుపత్రి సిబ్బంది చేతులెత్తేసారు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని పట్టణంలోని 'గాయత్రి ఆసుపత్రి'కి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడి పల్స్ రేటు దారుణంగా పడిపోయిందని గుర్తించారు. అత్యవసరంగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు.

**మార్గమధ్యలోనే అనంత లోకాలకు..**

సమయం మించిపోతుండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ బాలుడిని హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే దురదృష్టవశాత్తూ హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలుడు మనీశ్వర్ ప్రాణాలు విడిచాడు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.




**కేసు పెడితే పోస్టు మార్టం చేస్తారనే భయంతో...**

ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు చనిపోయాడని గ్రహించిన ఆ తల్లితండ్రులు తల్లడిల్లిపోయారు. ఆదివారం ఉదయం ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించి కేసు పెడదామని అనుకున్న వారికి కేసు నమోదైతే బాలుడి మృత దేహాన్ని పోస్టు మార్టం చేస్తారని ఆవేదన చెందారు. దేవుడా ఇదేమి ఖర్మ అనుకుంటూ తమ కుమారుడి మృత దేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్ళిపోయారు.

**అధికారుల పర్యవేక్షణ శూన్యం..గతంలోనూ విమర్శలు!**

పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో క్వాలిఫైడ్ డాక్టర్లు కాకుండా, నర్సింగ్ లేదా ఇతర చిన్న కోర్సులు చదివిన తెలిసి తెలియని వ్యక్తులతో ఇష్టమొచ్చినట్లు వైద్యం చేయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ 'బాలాజి ఆసుపత్రి'లో గతంలో కూడా ఇలాంటి వైద్య నిర్లక్ష్య ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పదే పదే జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికారుల మామూళ్ల కక్కుర్తి వల్లే తనిఖీలు జరగడం లేదని, ఫలితంగానే అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి.






**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**మన దునియా,ములుగు జిల్లా: మే 24**

జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు.స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్– గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి హాజరయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లయ్ కృష్ణవేణి, డి డబ్ల్యూ ఓ ప్రేమ లత, సి పి ఓ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# మావోయిస్టులకు పోలీసుల షాక్.. గడ్చిరోలిలో రహస్య కర్మాగారం ధ్వంసం




**మన దునియా,మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా:మే 24**

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. మావోయిస్టులు భూమిలో పాతిపెట్టిన ఆయుధ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే నాశనం చేశారు.లొంగిపోయిన మావోయిస్టుల నుంచి లభించిన కీలక సమాచారంతో ఈ ఆపరేషన్‌ను పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. "ఆపరేషన్ అంతిమ ప్రహార్"లో భాగంగా మే 16న గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టులను లోతుగా విచారించగా, పోమ్కే--బినాగుండా అటవీ ప్రాంతంలో ఆయుధాల తయారీకి సంబంధించిన సామగ్రిని రహస్యంగా దాచిపెట్టినట్లు సమాచారం లభించింది.దీంతో మే 21న పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రమేష్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక ఆపరేషన్ బృందాలు రంగంలోకి దిగాయి. గడ్చిరోలి ప్రత్యేక బృందాలు, ప్రాణహిత సంయుక్త టీమ్‌లు, బాంబు నిర్వీర్య దళం (బీడీడీఎస్) బృందాలు సంయుక్తంగా అటవీ ప్రాంతంలో విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి.మే 22న పోమ్కే--బినాగుండా ఉత్తర అటవీ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన భద్రతా బలగాలు మావోయిస్టులు దాచిపెట్టిన భారీ సామగ్రిని గుర్తించాయి. ఒక లేత్ మెషీన్, బీజీఎల్ పైపులు, 12 బోర్ పైపులు, ఇన్వర్టర్, జనరేటర్, బ్యాటరీలు, గ్రైండింగ్, డ్రిల్లింగ్ యంత్రాలు, జిగ్‌సా మెషీన్, ప్రెజర్ పంప్, సోలార్ ప్యానెల్, ఫుట్‌బాల్ పైప్‌తో పాటు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, ఈ సామగ్రిని మావోయిస్టులు నక్సల్ వారోత్సవాలు, ఎన్నికల సమయంలో భద్రతా దళాలపై దాడులకు వినియోగించేందుకు రహస్యంగా భూమిలో దాచిపెట్టినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఘటనా స్థలంలోనే పూర్తిగా ధ్వంసం చేశారు.ఈ ఆపరేషన్‌ను పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రమేష్, అదనపు ఎస్పీలు కార్తీక్ మధిర, గోకుల్ రాజ్, డీఎస్పీ విశాల్ నాగర్‌గోజే పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు విజయవంతంగా నిర్వహించాయి. ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లను ఉన్నతాధికారులు అభినందించారు.

## సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా,కాళేశ్వరం: మే 24**

కాలేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఈ రోజు భారీ సంఖ్యలో భక్తులు రావడం జరిగింది ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేయడంతో పాటు ఆలయంలో భక్తులు క్యూలైన్ విధానంలో దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయబడినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు.పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని నిరంతరం పరిశీలిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ స్వయంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను మోహరించి భక్తుల రాకపోకలను సమన్వయం చేస్తున్నారు.భక్తుల భద్రత దృష్ట్యా ఘాట్‌లు, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన రహదారుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయబడింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.భక్తులు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# వేం నరేందర్ రెడ్డి ఎన్నిక రాష్ట్రానికి గర్వకారణం

**ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు వేం నరేందర్ రెడ్డి**

**సహనం, చిరునవ్వుతో ముందుకు సాగే నాయకుడు వేం నరేందర్ రెడ్డి**

**ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ విస్మరిస్తోంది**

**ప్రశ్నించే యువత అకౌంట్ల బ్లాక్ చేయడం బీజేపీ అసహన రాజకీయాలకు నిదర్శనం**

**దేశంలో జరుగుతున్న అన్యాయాలను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారు**

**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది**

**రాష్ట్ర అభివృద్ధిలో సీఎం రేవంత్ రెడ్డి గారు రాకెట్ అయితే.. వేం నరేందర్ రెడ్డి నిప్పురవ్వ**

**వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య**

**వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ వేడుకల్లో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**మన దునియా,హనుమకొండ:మే 24**





రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి సన్మానోత్సవ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు విచ్చేసిన వేం నరేందర్ రెడ్డి గారికి ఎంపీ పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం నిర్వహించిన సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వెంటనే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ పార్లమెంట్ మెట్లపై జరిగిన ఆందోళనలో వేం నరేందర్ రెడ్డి తమతో కలిసి పాల్గొనడం శుభసూచికమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు పార్లమెంటరీ వ్యవహారాల్లో అనుభవం కలిగిన నాయకుడిగా ఆయన సేవలు దేశ స్థాయిలో తెలంగాణ స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తాయని పేర్కొన్నారు.దేశ ప్రజలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తోందని ఎంపీ విమర్శించారు. "కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగానే ప్రశ్నించే యువత అకౌంట్లను బ్లాక్ చేయించడం బీజేపీ అసహన రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్భయంగా ప్రశ్నిస్తున్నారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకెట్‌లా ముందుకు దూసుకెళ్తుంటే, ఆ రాకెట్‌కు నిప్పురవ్వలా వేం నరేందర్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. చిరునవ్వుతో, సహనంతో, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకుడు వేం నరేందర్ రెడ్డి గారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావడంలో వేం నరేందర్ రెడ్డి కృషి ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండాసురేఖ, ధనసరి అనసూయ సీతక్క, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జాటోత్ రామ్ చందర్ నాయక్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పనిచేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# రాజస్థాన్ దెబ్బకు కేకేఆర్ ఔట్.. ఢిల్లీతో మ్యాచ్ నామమాత్రం

**ముంబైపై రాజస్థాన్ రాయల్స్ విజయం... ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా ఖరారు**

**దీంతో కేకేఆర్ ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతు**

**కోల్‌కతా, ఢిల్లీ మధ్య చివరి లీగ్ మ్యాచ్ నామమాత్రం**

**టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న కేకేఆర్**

**గెలుపుతో సీజన్‌ను ముగించాలని చూస్తున్న ఇరు జట్లు**



ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతయ్యాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించి, నాలుగో జట్టుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. దీంతో ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా, ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) మధ్య జరగనున్న చివరి లీగ్ మ్యాచ్ పూర్తిగా నామమాత్రంగా మారిపోయింది. ఈ అప్రాధాన్య మ్యాచ్‌లో కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. వాస్తవానికి ప్లేఆఫ్స్ చేరాలంటే, ఈ మ్యాచ్‌లో ఢిల్లీపై భారీ తేడాతో గెలవడంతో పాటు, ముంబై చేతిలో రాజస్థాన్ ఓడిపోవాలి. అయితే, రాజస్థాన్ గెలవడంతో కేకేఆర్ అవకాశాలు పూర్తిగా మూసుకుపోయాయి. అటు, పంజాబ్ కింగ్స్ ఆశలు కూడా ఆవిరైపోయాయి. పంజాబ్ జట్టు కూడా సమీకరణాలు అనుకూలిస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకుంది. అయితే, రాజస్థాన్ గెలుపుతో పంజాబ్ తీవ్ర నిరాశకు గురైంది. టాస్ గెలిచిన అనంతరం రహానే మాట్లాడుతూ.. రాజస్థాన్ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా తాము గెలవడానికే ఆడతామని చెప్పాడు. "ఈ సీజన్‌లో మేము పుంజుకున్న తీరు పట్ల గర్వంగా ఉంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి టోర్నీని ముగించాలనుకుంటున్నాం" అని అన్నాడు. ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ.. తాము కూడా టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని తెలిపాడు. ఈ సీజన్‌లో కీలక సమయాల్లో క్యాచ్‌లు జారవిడిచి మూల్యం చెల్లించుకున్నామని, చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగుతామని వ్యాఖ్యానించాడు. ఢిల్లీ జట్టులోకి కుల్దీప్ యాదవ్, అకిబ్ నబీ తిరిగి రాగా, కేకేఆర్ ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగింది. ప్లేఆఫ్స్ అవకాశాలు లేనప్పటికీ, ఇరు జట్లు గెలుపుతో సీజన్‌ను ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

# ముంబైని ఓడించి ప్లేఫ్స్‌లోకి రాజస్థాన్... ఎలిమినేటర్ లో సన్‌రైజర్స్ తో ఢీ

**ముంబై ఇండియన్స్‌ను 30 పరుగుల తేడాతో ఓడించి ప్లే ఆఫ్స్‌కు చేరిన రాజస్థాన్**

**ఈ విజయంతో పంజాబ్, కోల్‌కతా ప్లే ఆఫ్స్ ఆశలకు గండి**

**ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్థాన్ రాయల్స్ ఢీ**

**సూర్యకుమార్ యాదవ్ (60) పోరాటం వృథా, 9వ స్థానంతో సీజన్‌ను ముగించిన ముంబై**

**ఆల్ రౌండర్ ప్రదర్శనతో ఆకట్టుకున్న జోఫ్రా ఆర్చర్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ కైవసం చేసుకుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన అత్యంత కీలకమైన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో విజయం సాధించి, ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ తమ స్థానాన్ని పదిలం చేసుకోవడమే కాకుండా, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల ఆశలపై నీళ్లు చల్లింది. ఇక చండీగఢ్‌లో మే 27న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. నేటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. బ్యాటర్లందరూ సమష్టిగా రాణించడంతో రాజస్థాన్ ఈ స్కోరును సాధించగలిగింది. ధ్రువ్ జురెల్ (38), దాసున్ శనక (29) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, చివర్లో జోఫ్రా ఆర్చర్ (15 బంతుల్లో 32), రవీంద్ర జడేజా (11 బంతుల్లో 19 నాటౌట్) మెరుపు వేగంతో పరుగులు సాధించి జట్టు స్కోరును 200 దాటించారు. 206 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జోఫ్రా ఆర్చర్ అద్భుత బౌలింగ్‌తో రోహిత్ శర్మను డకౌట్‌గా పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత నమన్ ధిర్ (6), రియాన్ రికెల్టన్ (12), తిలక్ వర్మ (3) కూడా స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 60) అద్భుతమైన అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. అతనికి విల్ జాక్స్ (33), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (34) నుంచి మంచి సహకారం లభించడంతో ముంబై శిబిరంలో ఆశలు చిగురించాయి. ఒక దశలో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. అయితే, కీలక సమయంలో రాజస్థాన్ బౌలర్లు మళ్లీ పట్టు సాధించారు. ప్రమాదకరంగా మారుతున్న హార్దిక్ పాండ్యాను జోఫ్రా ఆర్చర్ అవుట్ చేయగా, ఆ తర్వాత ఓవర్లోనే నాంద్రే బర్గర్.. క్రీజులో పాతుకుపోయిన సూర్యకుమార్‌ను పెవిలియన్ పంపాడు. ఈ రెండు వికెట్లతో ముంబై ఓటమి ఖాయమైంది. చివరకు ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ ఓటమితో ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌ను 9వ స్థానంతో నిరాశగా ముగించింది.



# ఈడెన్‌లో ఢిల్లీ బ్యాటర్ల జోరు.. కేకేఆర్ ముందు భారీ టార్గెట్



**ఈడెన్‌లో చెలరేగిన ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు**

**అర్ధశతకంతో కేఎల్ రాహుల్ విధ్వంసం**

**నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు**

**కోల్‌కతా నైట్ రైడర్స్ విజయ లక్ష్యం 204**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు అదరగొట్టారు. సొంత మైదానం ఈడెన్ గార్డెన్స్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కేకేఆర్‌కు ఢిల్లీ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించారు. దీంతో కోల్‌కతా ముందు 204 పరుగుల కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 30 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 60 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. అతనికి కెప్టెన్ అక్షర్ పటేల్ (25 బంతుల్లో 39), డేవిడ్ మిల్లర్ (19 బంతుల్లో 28) తోడయ్యారు. ఆఖర్లో అశుతోష్ శర్మ (11 బంతుల్లో 18 నాటౌట్) వేగంగా పరుగులు సాధించడంతో ఢిల్లీ స్కోరు 200 దాటింది. కేకేఆర్ బౌలర్లలో సౌరభ్ దూబే ఆకట్టుకున్నాడు. 4 ఓవర్లలో 28 పరుగులు మాత్రమే ఇచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్ తలా ఒక వికెట్ తీశారు. అయితే, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 55 పరుగులు సమర్పించుకున్నాడు.

# తలో చేయి వేసిన రాజస్థాన్ బ్యాటర్లు.. ముంబై ముందు భారీ లక్ష్యం

**ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో రాజస్థాన్ భారీ స్కోరు**

**సమష్టి ప్రదర్శనతో 20 ఓవర్లలో 205 పరుగులు**

**ఏ ఒక్క బ్యాటర్ హాఫ్ సెంచరీ చేయకపోయినా 200 దాటిన స్కోరు**

**ధ్రువ్ జురెల్ (38), జోఫ్రా ఆర్చర్ (32) కీలక ఇన్నింగ్స్‌లు**

**ముంబై ముందు 206 పరుగుల విజయ లక్ష్యం**

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లు సమిష్టిగా రాణించారు. వాంఖడే స్టేడియం వేదికగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్, ఏ ఒక్కరూ భారీ ఇన్నింగ్స్ ఆడకపోయినా వచ్చిన వారంతా తలోచేయి వేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోరు చేసింది. రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్క బ్యాటర్ కూడా హాఫ్ సెంచరీ నమోదు చేయలేదు. అయినా పరుగుల వేగం మాత్రం ఎక్కడా తగ్గలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (17 బంతుల్లో 27) మూడు సిక్సర్లతో మెరుపు ఆరంభాన్నిచ్చాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లలో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (26 బంతుల్లో 38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివర్లో దసున్ షనక (15 బంతుల్లో 29), జోఫ్రా ఆర్చర్ (15 బంతుల్లో 32) విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ తమ ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్ల చొప్పున బాదారు. రవీంద్ర జడేజా (19 నాటౌట్), నంద్రే బర్గర్ (10 నాటౌట్) ఆఖరి ఓవర్లలో దూకుడుగా ఆడటంతో రాజస్థాన్ 200 పరుగుల మార్కును దాటింది. ముంబై బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీసినప్పటికీ పరుగులను కట్టడి చేయడంలో విఫలమయ్యారు. శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్ చెరో రెండు వికెట్లు పడగొట్టినా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే ముంబై ఇండియన్స్ 206 పరుగులు చేయాల్సి ఉంది.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం

## ఇప్పటి బాలీవుడ్ లో అలాంటి బంధాలకు చోటు లేదు: అమీషా పటేల్



**ఇప్పటి బాలీవుడ్‌లో నిజమైన స్నేహబంధాలు లేవన్న అమీషా పటేల్**

**హీరో హృతిక్ రోషన్‌తో ఉన్న పాత ఫోటోను షేర్ చేసిన నటి**

**ఒకప్పటి అమాయకత్వం, బంధాలు ఇప్పుడు కనిపించడం లేదని వ్యాఖ్య**

**భారతీయ సెలబ్రిటీలను మనవాళ్లే ఎక్కువగా ట్రోల్ చేస్తారని ఆవేదన**

బాలీవుడ్ సీనియర్ నటి అమీషా పటేల్, చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి నటీనటుల మధ్య ఒకప్పటిలా నిజమైన స్నేహబంధాలు, అమాయకత్వం కనిపించడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదివారం తన తొలి సినిమా 'కహో నా... ప్యార్ హై' సహనటుడు హృతిక్ రోషన్‌తో దిగిన ఒక పాత ఫోటోను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు.ఫుకెట్‌లో సినిమా షూటింగ్ సందర్భంగా ఒక రెస్టారెంట్‌లో హృతిక్‌తో కలిసి డిన్నర్ చేస్తున్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ, అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "ఒకప్పటి ఆ అమాయకత్వం, సహనటుల మధ్య ఉండే నిజమైన బంధాలు ఇప్పటి బాలీవుడ్ లో లేవు. కానీ అలాంటి స్నేహాలు, బంధాలు ఏర్పరచుకోవడం నా అదృష్టం" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ఫోటో, ఆమె వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఇదే సమయంలో, భారతీయ సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ట్రోలింగ్‌పై కూడా అమీషా స్పందించారు. హాలీవుడ్ స్టార్లతో పోలిస్తే మన దేశంలోనే సెలబ్రిటీలను ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకరినొకరు కిందికి లాగే మనస్తత్వం భారతీయులలో పెరిగిపోయింది. పెద్ద ఈవెంట్లలో మన స్టార్ల డ్రెస్సింగ్ లేదా వారి తీరును మనవాళ్లే టార్గెట్ చేయడం సిగ్గుచేటు" అని ఆమె ఎక్స్ వేదికగా విమర్శించారు.

## పొరపాటున అలా అనేసి.. బుమ్రాకు క్షమాపణలు చెప్పిన రామ్ చరణ్

**బుమ్రాను పొరపాటున ఫుట్‌బాలర్‌గా సంబోధించిన మెగా పవర్‌స్టార్**

**పేర్ల విషయంలో తనకు కాస్త మతిమరుపని ఎక్స్‌లో పోస్ట్**

**అది మానవ సహజంగా జరిగిన పొరపాటు అని వివరణ**

**మీ ఆటతీరుకు నేను పెద్ద అభిమానినంటూ బుమ్రాపై ప్రశంస**

ప్రముఖ నటుడు రామ్ చరణ్.. భారత క్రికెట్ జట్టు పేస్ దిగ్గజం జస్‌ప్రీత్ బుమ్రాకు బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఓ కార్యక్రమంలో బుమ్రాను పొరపాటున ఫుట్‌బాల్ ఆటగాడిగా సంబోధించడంతో ఆ తప్పును సరిదిద్దుకుంటూ ఆదివారం తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు."అయ్యో.. నేను కొన్నిసార్లు పేర్ల విషయంలో నిజంగా చాలా మతిమరుపుతో ఉంటాను. జస్‌ప్రీత్ బుమ్రా జీ.. నన్ను క్షమించండి. ఆ జనసందోహం, ఉత్సాహం మధ్యలో అది మానవ సహజంగా జరిగిన పొరపాటు మాత్రమే. నేను మిమ్మల్ని ఎంతో గౌరవిస్తాను. మీ ఆటతీరుకు నేను పెద్ద అభిమానిని. మీరు బ్యాటర్లను నిలకడగా ఒత్తిడికి గురిచేస్తూ ప్రతి భారతీయుడు గర్వపడేలా చేస్తున్నారు" అని చరణ్ తన పోస్టులో పేర్కొన్నారు. గతంలో ఓ ఈవెంట్‌లో భారత క్రికెటర్ల గురించి అడిగినప్పుడు రామ్ చరణ్ మాట్లాడుతూ.. "బుమ్రాకు నేను పెద్ద అభిమానిని. నాకు ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. మీరు దానిని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల వల్లే తాజా గందరగోళం తలెత్తింది.ఇక సినిమాల విషయానికొస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్, దివ్యేందు, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, విజయ్ సేతుపతి వంటి ప్రముఖ నటులు నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026, జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.





## 'పెద్ది' ఈవెంట్‌లో జాన్వీ కపూర్ మెరుపులు.. రాయల్ లుక్‌లో అదరగొట్టిన బ్యూటీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో శనివారం రాత్రి ఈ చిత్ర మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌ను చిత్రబృందం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు హాజరైన కథానాయిక జాన్వీ కపూర్, తన అద్భుతమైన ఫ్యాషన్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా ఆమె ధరించిన లెహెంగా, ఈ సీజన్‌లో పెళ్లి చేసుకోబోయే వధువులకు ఒక అద్భుతమైన ఎంపికగా నిలుస్తుందని ఫ్యాషన్ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.ఈ వేడుక కోసం జాన్వీ కపూర్, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన ముదురు వంగ పువ్వు రంగు (డీప్ పర్పుల్) లెహెంగా సెట్‌లో రాజకుమారిలా మెరిసిపోయారు. స్టైలిస్ట్ మేగన్ కాన్సెసియో పర్యవేక్షణలో, సంప్రదాయ భారతీయ హస్తకళను ఆధునిక డిజైన్‌తో మిళితం చేసి, ఒక 'ఆధునిక భారతీయ యువరాణి' రూపాన్ని ఆవిష్కరించారు. ఈ లెహెంగా సెట్‌లోని క్రాప్డ్ బ్లౌజ్ జాన్వీ అందాన్ని మరింత పెంచింది. రౌండ్ నెక్‌లైన్, హాఫ్ స్లీవ్స్‌తో ఉన్న ఈ బ్లౌజ్‌పై సున్నితమైన సీక్విన్‌లు, క్లిష్టమైన జరీ ఎంబ్రాయిడరీ, చిన్న తెల్లని పూసలతో చేసిన అలంకరణ అద్భుతంగా ఉంది. ఈ డిజైన్ ఆమె మిడ్‌రిఫ్‌ను హైలైట్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జతగా, అదే రంగులో ఉన్న హై-వెయిస్టెడ్ ఏ-లైన్ లెహెంగా స్కర్ట్‌పై సంప్రదాయ గోల్డ్ జరీ వర్క్ చూపరులను కట్టిపడేసింది. ఇక, ఒక భుజంపై పిన్ చేసి, నడుము వద్దకు అందంగా చుట్టిన పల్చటి షిఫాన్ దుపట్టా ఆమె లుక్‌కు సంపూర్ణతను తెచ్చిపెట్టింది.కేవలం దుస్తులే కాదు, ఆమె ధరించిన ఆభరణాలు కూడా ప్రత్యేకంగా నిలిచాయి. 'మహేష్ నోతన్‌దాస్' జ్యువెలరీ నుంచి ఎంచుకున్న భారీ గోల్డ్ నెక్ పీస్, దానికి వేలాడుతున్న ముత్యాలు రాయల్ లుక్‌ను ఇచ్చాయి. బ్లౌజ్‌పై పొరలుగా అమర్చిన ముత్యాల బ్రూచ్‌లు, చెవులకు అలంకరించిన భారీ జుంకాలు, వాటికి అనుసంధానంగా ఉన్న కణ్ ఫూల్ (ఇయర్ కఫ్), చేతులకు ధరించిన హాథ్ ఫూల్ (హ్యాండ్ హార్నెస్), భారీ స్టేట్‌మెంట్ రింగ్... ఇలా ప్రతి ఆభరణం ఆమెను ఒక ఆధునిక యువరాణిలా మార్చేసింది. సౌరవ్ రాయ్, విధి పెరీరా తీర్చిదిద్దిన సంప్రదాయ జడ, మధ్యలో పాపిడితో నీట్‌గా కనిపించింది. ఇక మేకప్ విషయానికొస్తే, గోల్డ్ షిమ్మరింగ్ ఐషాడో, స్మడ్జ్ బ్లాక్ ఐలైనర్, నుదుట చిన్న వంగ పువ్వు రంగు బొట్టుతో ఆమె ముఖం ప్రకాశవంతంగా కనిపించింది.మొత్తం మీద, గ్లామర్‌తో కూడిన ఈ సంప్రదాయ లుక్‌లో జాన్వీ కపూర్ పెళ్లిళ్ల సీజన్‌లో జరిగే వేడుకలకు సరికొత్త ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచారు. కాగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com